## క్లుప్తంగా

### త్రివర్ణ పతాకంతో ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే జగదీశ్వరి, తదితరులు

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** దేశం కోసం సరిహద్దుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడుతున్న సైనికులకు మద్దతుగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, తదితరులంతా త్రివర్ణపతాకం చేతపట్టుకుని జవాన్ల సేవలు ప్రశంసిస్తూ ప్రధాన రోడ్డులో తిరిగారు. పహల్గామ్ దాడికి ప్రతీకార చర్యగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ సైన్యం చేపట్టిన ఎదురు దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీరజవాన్‌లకు జోహార్లు చెప్పారు. రాత్రింబవళ్లు మన కోసం పోరాడుతున్న జవాన్లను, వారి కుటుంబాలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నారు.

### పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

**కొమరాడ:** మండలంలోని ఆర్తాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బెలగాపు సంగంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆ గ్రామానికి శనివారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంగంనాయుడు మృతి పట్ల సంతాపం ప్రకటించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వనర్ ద్వారపురెడ్డి జనార్దన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, కళ్లికోట సర్పంచ్ దత్తి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అటవీ సరిహద్దుల ఏర్పాటు



సరిహద్దు దిమ్మ నిర్మిస్తున్న కూలీలు

**గుమ్మలక్ష్మీపురం:** స్థానిక అటవీ శాఖ సెక్షన్ కార్యాలయానికి చెందిన మండ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతాలను గుర్తించేలా సరిహద్దు దిమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. పలుచోట్ల బీట్ పరిధిలో నిర్మిస్తున్న దిమ్మెలను బీట్ ఆఫీసర్ ఎస్.రామారావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన దిమ్మెల్లో పాడైన వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు.

### పోలీస్ తనిఖీలు



ఏబీ రోడ్డును పరిశీలిస్తున్న పోలీసులు

**భామిని:** మండల కేంద్రంలోని ఏబీ రోడ్డుకు ఇరువైపులా పోలీస్ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. తివ్వాకొండల పరిసరాల్లో మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే అనుమానంతో ఏబీ రోడ్డు వెంబడి ఖానాలు, కల్వర్టులను నిశితంగా పరిశీలించారు. పరిశీలనలో ట్రైనీ ఎస్సైలు, బత్తిలి పోలీసులు పాల్గొన్నారు.

### సీతంపేటలో వర్షం



దిబ్బగూడలో నేలకొరిగిన అరటి చెట్లు

**సీతంపేట:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ విపరీతంగా ఉండడంతో ఉక్కబోతతో అవస్థలు పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి సేదదీరారు. అయితే ఈదురుగాలులకు అరటి పంట నేలకొరిగిందని రైతులు తెలిపారు. దిబ్బగూడలో రైతు శ్రీనుకు చెందిన 50 సెంట్ల పొలంలో అరటి చెట్లు నేలకొరిగాయి.

### పోటెత్తిన భక్తజనం

**గరుగుబిల్లి:** తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. పవిత్ర వైశాఖ మాసం పురస్కరించుకుని, ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుముర్రై, తీర్థఘోష్టి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ క్రమంలో స్వామి దర్శనానికి భక్తులు ఎగబడ్డారు. ప్రత్యేక పూజలు చేయడంతో పాటు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# రహదారికి మోక్షం కలిగేనా..!

**పాలకొండ రూరల్:** పల్లె పండగలో భాగంగా పాలకొండ మండలం పద్మాపురం సచివాలయం పరిధిలో వాటపాగు వయా చింతాడ మీదుగా పద్మాపురం వరకూ దాదాపు 2.4 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.కోటి 90 లక్షలతో అట్టహాసంగా పనులు ప్రారంభించారు. ఈ ప్రక్రియ చేపట్టి దాదాపుగా వంద రోజులు పైబడింది, ఎస్ఆర్‌ఐఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఎర్త్ వర్కు చేపట్టారు. గ్రావెల్‌తో పాటు మెటీరియల్ సమకూర్చారు. ఎక్కడికక్కడ కల్వర్టు నిర్మాణాలకు గుంతలు తవ్వారు. దాదాపు 30 శాతం పనులు కార్యరూపం దాల్చాయి. ఇక్కడ వరకూ అంతా బాగుంది. త్వరలో రహదారి అందుబాట్లోకి వస్తుందని భావించిన మూడు గ్రామాల ప్రజలకు లేని కష్టాలు ఇప్పుడు ప్రారంభమయ్యాయి. ఉన్న రోడ్డు తవ్వేయటంతో పాటు మెటీరియల్ రోడ్డుపై వదిలేయటంతో కనీస రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామీణులు వాపోతున్నారు. రోజుల తరబడి రోడ్లపై మెటీరియల్ ఉండిపోవటంతో అది కూడా వృథాగా పోతుందని, అసలు పనులు ఎందుకు ముందుకు సాగటం లేదో తెలియక ఈ రహదారికి మోక్షం ఎప్పుడని అటుగా వచ్చే అధికారులను, ప్రజా ప్రతినిధులు అయా ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు అడుగుతున్నారు.



పద్మాపురం వయా చింతాడ రహదారి దుస్థితి



రహదారి వేస్తామని రోడ్డుపై వదిలేసిన మెటీరియల్

## టెండర్లకు నిరుద్యోగ యువతకు అవకాశమివ్వాలి

**గుమ్మలక్ష్మీపురం:** పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య పాఠశాలలు, వసతి గృహాలకు సంబంధించి, నిత్యావసరాల సరఫరాకు వేసే టెండర్లకు నిరుద్యోగులైన గిరిజన యువతకు అవకాశం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఓ ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. ఆయా విద్యాసంస్థలకు కూరగాయలు, కోడిగుడ్లు, పాలు, పండ్లు, చికెన్ తదితర సరుకుల సరఫరాకు చేపట్టే టెండర్లలో ఎప్పుడూ నాన్ ట్రైబల్, నాన్ లోకల్ వారికే అవకాశం కల్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవే టెండర్లను స్థానిక గిరిజన యువతకు కల్పిస్తే ఉపాధి మార్గం కల్పించినట్లు అవుతుందన్నారు. దీనిపై ఓసారి ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు

**గరుగుబిల్లి:** సహకార బ్యాంకుల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని విజయనగరం డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన.. విలేకరులతో కాసేపు మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,165 కోట్ల లావాదేవీలు నిర్వహించడం జరిగిందని, డీసీసీబీకి రూ.7.66 కోట్ల నికర ఆదాయం వచ్చిందని తెలిపారు. నికర ఆదాయంలో జిల్లాలోని 94 పీఏసీఎస్‌లకు 1 శాతం అందించడం జరిగిందన్నారు. సహకార బ్యాంకుల ద్వారా టిడ్కో గృహాల నిర్మాణాలకు, ప్రభుత్వ పథకాలకు రుణాలు అందించడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఉభయ జిల్లాల పరిధిలో రూ.2,600 కోట్ల రుణసాయం అందివ్వడాన్ని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. విజయనగరం జిల్లా పరిధిలో నాలుగు, పార్వతీపురం జిల్లా పరిధిలో ఒక బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకే డీసీసీబీ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. పరిశీలనలో డీసీసీబీ మేనేజర్ సీహెచ్ రవికుమార్, ఆప్కాబ్ డీపీఎం గౌరీశంకర్, నోడల్ అధికారి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు

## అగ్నిప్రమాద బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే



బాధితులకు నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

**గరుగుబిల్లి:** చినగుడబ గ్రామంలో అగ్నిప్రమాద బాధితులకు మాజీ ఎమ్మెల్యే పాము ల పుష్పశ్రీవాణి అండగా నిలిచారు. ఇటీవల జరిగి న ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన కుటుంబాలకు 50 కిలోల బియ్యం, కూరగాయలు తదితర నిత్యావసర సరుకులతో పాటు కొంత నగ దు శనివారం అందజేశారు. ఈ మేరకు ప్రమాద బాధితులు ముడిలి కళావతి, ముడిలి మోహనరా వు, ముడిలి భాస్కరరావులు.. మాజీ ఎమ్మెల్యే సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. బాధితులకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చూస్తానని మాజీ ఎమ్మెల్యే భరోసానిచ్చా రు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, వైస్ ఎంపీపీ బి.లక్ష్మి, సర్పంచ్ ముదిలి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

**గుమ్మలక్ష్మీపురం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించామని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని వక్తలు కోరారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు.

### చలివేంద్రం ఏర్పాటు

**గరుగుబిల్లి:** మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఉన్న బస్టాప్ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీట్ ది హీట్ నినాదంతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి తెలిపారు. వేసవి ఎండల కారణంగా తలెత్తే దాహార్తి తీర్చుకునేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

### యోగాతో ఏకాగ్రత

**పాలకొండ రూరల్:** క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల మనిషిలో ఏకాగ్రత పెరుగుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, యోగా శిక్షకుడు కె.జనార్దనరావు అన్నారు. శనివారం స్థానిక రుషి యోగా కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు యోగాసనాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ముఖ్యంగా యోగాలో సూర్య నమస్కారాల ఆవశ్యకత, వాటి ప్రయోజనాలపై వివరించారు. నేటి యాంత్రిక సమాజంలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఒక్కటే మార్గమన్నారు.

### పుస్తక పఠనంతో మేధస్సు

**పాలకొండ రూరల్:** విద్యార్థులు సెలవులను వృథా చేసుకోకుండా పుస్తక పఠనం అలవర్చుకోవాలని.. పుస్తకపఠనంతో మేధస్సు పెరుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి బబ్బూరి గణేష్ బాబు అన్నారు. గ్రంథాలయంలో కొనసాగిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనవారం పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అలాగే ఫ్యాషన్ డిజైన్, వ్యర్థాలతో బొమ్మలు తయారుచేయు విధానంపై శిక్షణ అందించారు.

## • పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది అంతా కార్యక్రమంలో పాల్గొని, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని కోరారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



వీరఘట్టం: పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ప్రత్యేకాధికారి ఆర్.కృష్ణవేణి, ఎంపీడీఓ రమణమూర్తి, పంచాయతీ సిబ్బంది



జియ్యమ్మవలస పీహెచ్‌సీ వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



గరుగుబిల్లి: ఉద్దవోలులో ర్యాలీలో మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు, ఎంపీడీవో పైడితల్లి



పాలకొండ: ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ రత్నంరాజు, సిబ్బంది



సీతంపేట: ఐటీడీఏ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న పీఓ, తదితరులు

## మెలకువలతో వేడిని అధిగమిద్దాం..

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు

**పాలకొండ రూరల్:** ప్రస్తుత వేసవిలో ఎండల నుంచి రక్షణ పొందేందుకు మెలకువలు పాటించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. హీట్ ద బీట్ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరంలో నీటి నిల్వల స్థాయిని కాపాడుకోవాలన్నారు. త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడంతో పాటు పండ్లను ఎక్కువగా తినాలని సూచించారు. అనంతరం పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. స్థానిక సబ్‌జైల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమలో వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

## మహిళల జీవనోపాధి మెరుగుకు చర్యలు

**గరుగుబిల్లి:** మహిళల జీవనోపాధి మెరుగుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ఆమె శనివారం పరిశీలించారు. శిక్షణలో ఏమేమి నేర్పిస్తున్నారన్న విషయాలను శిక్షణార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపడుతోందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**కొమరాడ:** మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణను బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గెడ్డమ్మ శనివారం పరిశీలించారు. మహిళల స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ 90 రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట ఎంపీడీవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: శిక్షణార్థులతో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ

### నిరంతర పర్యవేక్షణ అవసరం

**పాలకొండ రూరల్:** గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణు లు, బాలింతలు, చంటి బిడ్డల ఆరోగ్య రక్షణ పట్ల నిరంతర పర్యవేక్షణ అవసరమని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నా రు. క్షేత్రస్థాయిలో రోజువారీ వైద్య తనిఖీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సీజనల్ జ్వరాలను కట్టడి చేసేందుకు గుర్తించిన గ్రామాల్లో నేటి నుంచి మలాథియన్ పిచికారీ చేయాలని ఆదేశించారు.

## వితరణ

**పాలకొండ:** స్థానిక ఏరియా ఆస్పత్రికి హైదరాబాద్ చెందిన దక్కన్ కెమికల్స్ సంస్థ రూ. 33 లక్షల విలువ చేసే అల్ట్రాస్కాన్‌ను వితరణగా అందించారు. ఈ మేరకు స్కాన్ సేవలను సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి , ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో మరిన్ని సేవలు అందించేందుకు అవకాశం కలిగిందని తెలిపారు. ఇందుకు అవసరమగు వైద్యులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ.. పేద రోగులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం కలిగిందని తెలిపారు. ప్రధానంగా గర్భిణులకు ఉపయోగపడే స్కానింగ్ అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగభూషణరావు, దక్కన్ కెమికల్ ప్రతినిధి మనోహర్, కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్, వైద్యులు పాల్గొన్నారు.



అల్ట్రా స్కాన్ సేవల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు

### మలుపు..ప్రమాదానికి పిలుపు!



గుమ్మలక్ష్మీపురం మండలం, పి.ఆమిటి గ్రామ సమీపంలోని రోడ్డు మలుపు ప్రమాదకరంగా కనిపిస్తోంది. రహదారి వంపు ఎక్కువగా ఉండడంతో పాటు అక్కడి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు(రెయిలింగ్ మాదిరి) లేవు. దీంతో ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. చాలా జాగ్రత్తగా రావాలని, ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం కొనితెచ్చుకోక తప్పదని అంటున్నారు. ముఖ్యంగా కల్వర్టుకు ఇరువైపులా గోడలు నిర్మించాలని, అలాగే ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తే బాగుంటుందని వాహనదారులు కోరుతున్నారు. –గుమ్మలక్ష్మీపురం

### మూలకు చేరిన జనరేటర్



జియ్యమ్మవలస ఎంపీడీవో కార్యాలయం జనరేటర్ మూలకు చేరింది. విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు గతంలో దీనిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది మరమ్మతులకు గురై పనికిరాకుండా పోయింది. అకాల వర్షాలు, గాలులు, విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో కరెంట్ ఆపివేసినప్పుడు ఈ జనరేటర్ పనికివచ్చేదని సిబ్బంది చెబుతున్నారు. బాగు చేయాలని కోరుతున్నారు. –జియ్యమ్మవలస రూరల్

### మలాథియాన్ పిచికారీ...



ఐటీడీఏ కార్యాలయంలో దోమల నివారణకు మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో సిబ్బంది మలాథియాన్‌ను శనివారం పిచికారీ చేశారు. పీఓ బంగ్లాతో పాటు వివిధ శాఖల కార్యాలయాల్లో మందు పిచికారీ చేసినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలరాజు, ఎంటీఎస్ ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

## సంక్షిప్తంగా...

### సైనికులకు మద్దతివ్వాలి



ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

**పాలకొండ:** దేశం కోసం పోరాటం చేస్తున్న సైనికులకు భారతదేశ పౌరులు మద్దతివ్వాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో శనివారం స్థానిక కోటదుర్గమ్మ ఆలయం నుంచి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవసరమైతే ప్రతిఒక్కరూ దేశం కోసం సైనికులుగా మారాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ సైనికులు, యువత పాల్గొన్నారు.

### సమ్మె వాయిదా..

**పాలకొండ రూరల్:** ఈ నెల 20న చేపట్టాల్సిన దేశవ్యాప్త సమ్మె వచ్చే నెల 9కి వాయిదా పడినట్లు ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. యుద్ధ వాతావరణం కారణంగా జాతీయ కార్మిక సంఘాలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు మండలంలోని కొండాపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సమ్మె వాయిదా పడినప్పటికీ 20న మండల, జిల్లా కేంద్రాల్లో కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కౌలు రైతుల సంఘ నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, బి.దుర్గారావు, ఎం.సన్యాసినాయుడు, పారినాయుడు పాల్గొన్నారు.

### ధ్యానంతో జ్ఞాపకశక్తి

**గరుగుబిల్లి:** ధ్యానంతో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తెరగాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన..ఉన్నత చదువులు, ఉపాధి, ఉద్యోగావకాశాలపై విద్యార్థులు, యువతకు దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ ఏదైనా సాధించాలన్న పట్టుదల దానికి తగ్గ కృషి అవసరమన్నారు. విజయనగరం మహారాజా ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌ల రిటైర్డ్ చీఫ్ మేనేజర్‌లు లక్ష్మణరావు, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపు

**పాలకొండ రూరల్:** ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. ఎంఈఓ కురిటి సోంబాబు, ఐఈఆర్‌టీలు సత్యనారాయణ, అరుణ శనివారం మండల కేంద్రంలో సర్వే చేపట్టారు. పట్టణ పరిధిలోని దేవరపేట, బోనం వీధి, కోమటిపేట, శిల్పిపోతన్న వీధి, తదితర ప్రాంతాల్లో ఈ సర్వే కొనసాగింది. ఆటిజం లక్షణాలతో ఇబ్బంది పడుతున్న పి.నందన్ అనే చిన్నారిని గుర్తించి, అతడి వయసు ఆధారంగా హట్కో కాలనీ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ సూచించారు.



సర్వేలో పాల్గొన్న ఎంఈఓ, తదితరులు